
# చక్రపాణి

ఎమ్వీయల్



ఇది నేను పదోసారి హైదరాబాదు వెళ్ళటం. నూజివీడునుంచి బస్సు వేశాక హైదరాబాదు చాలా దగ్గరయినట్లయింది. అదివరకు రాజధానికి వెళ్ళాలంటే పెద్ద ప్రయాణం,ప్రయత్నం. అయినా నేను వెళ్ళిందెప్పుడు కనక.

రాజకీయాల్ని వ్యాపారంగా మార్చుకుని హడావుడిగా అటూ యిటూ తిరిగేవాళ్ళకి తప్ప మామూలు మనుషులకి రాజధాని ప్రయాణాల అవసరం ఏముంటుంది.

పక్కింటి సుందర్రావు గారి బామ్మగారు అంటుంది.

"చక్రపాణి అదృష్టవంతుడు. వాడికేం" అని.

బామ్మగారు అన్నారనికాదు కాని నేను అదృష్టవంతుడన్న నమ్మకం నాకూ ఉంది.

చిన్నప్పుడు జాతకం చెప్పిన దీక్షితులు గారి మాటలు విన్నప్పట్నుంచి ఆ నమ్మకం.

ఆ తరవాత అదృష్టచక్రం కాస్త అటూయిటూ అవుతోందన్న అనుమానం వచ్చినపుడల్లా ఎవడో జోస్యుడి దగ్గరకు వెళ్ళటం, పావలో అర్ధో సమర్పించుకుని "నువ్వు చాలా అదృష్టవంతుడివి నాయనా అనిపించుకోవడం.

కోయ దొర దగ్గర్నుంచి చిలక జోస్యం గాడి వరకు అందరూ నా అదృష్టం గురించి ఆశ్చర్యం ప్రకటించిన వారే.

తాతయ్య ఒక విద్య నేర్పాడు. బస్తీకి వెళ్ళటానికి బస్సుకోసం కూచున్నప్పుడు సామాన్యంగా బస్సురాదు. అప్పుడు బస్సు వస్తుందో,రాదో తెలుసుకోవటానికి మనకిమనం ఒక చక్రంవేసుకోవచ్చు: గుండ్రంగా సున్నా గియ్యడం కళ్ళుమూసుకుని సున్నా చుట్టూ సూర్యకిరణాల్లా గీతలు గియ్యటం. ఆ గీతలు ఎనిమిదివస్తే బస్సు వస్తుందన్నమాట. అటూ యిటూ అయితే బస్సురాదు.

గీతలు గీసేప్పుడు లెక్కపెట్టుకుని ఎనిమిదే గియ్యొచ్చుగా!

తాతయ్యని అదే అడిగాను. "లెక్కపెట్టుకోకుండా గబగబా గియ్యాలోయ్" అనేవాడు. ఒకోసారి తొమ్మిది గీతలు వచ్చేవి. అనుకున్నపని జరగదని డీలాపడిపోవటానికి మనసొప్పేది కాదు. అప్పుడు తాతయ్య తప్పు చెప్పాడు అసలు గీతలు తొమ్మిదే అయ్యుంటాయి అనుకునే వాడ్ని.

బాబిగా డొకసారి బజార్కెళ్ళి రాత్రి ఎనిమిదయినా తిరిగిరాలా, సావిత్రి కంగారుపడి అందర్నీ కంగారు పెట్టింది. ఒక్కగానొక్క కొడుకు ఏమయ్యాడో" అని"

మా తమ్ముడు వెంకటేశంగాడు సైకిలేసుకు బయల్దేరాడు నాలుగు చోట్లా వెతికి వస్తానని.

నేను అదృష్ట చక్రంగీస్తూ కూచుండిపోయాను. ఎన్నిసార్లు గీసినా ఎనిమిదే వచ్చేసరికి నాకుధైర్యం వచ్చింది. రాత్రి పదింటికి వెంకటేశంగాడు వొంటరిగా తిరిగిరావటంతో కాస్త దిగజారినా చక్రం సంగతి చెప్పి ఓదార్చాను.

"మఛ్వాకదివి. చక్రాలు వంకాయలు అంటూ. నాకసలే భయం, భక్తి లేక అడ్డమైన వాళ్ళతో తిరుగుతున్నాడు. ఏ సినిమాకో పోయుంటాడు. వెధవ" అన్నాడు వెంకటేశం.

అవటానికివాడు నా తమ్ముడే అయినా నా గుణాలొక్కటీలేవు.

దేవుడూ దెయ్యం ఏవీ లేవంటాడు. చివరికి పూనకం కూడా నమ్మడు. ఏమో బాబూ! ఈకాలం కుర్రాళ్ళు. నరసింహస్వామి కోవెల్లో పత్తెం కనబడదూ!

గుమ్మడిపాడు తీగ నాగేశ్వరస్వామి పడగలాగా వస్తే అందులో మహత్యం లేదూ!

వాడన్నట్టుగా బాబిగాడు సినిమాకే వెళ్ళి అర్ధరాత్రి అటయ్యాక ఇంటికి వచ్చాడు.

నా చక్రం ఫలితం కనబడిందా లేదా!

అయినా సరే వెంకటేశంగాడు నమ్మడు. ఇవాల్టికివాళ వీధిలో తగూతో ఇంటి దగ్గరే ఆలస్యమైపోయింది. టైముకు వెళ్ళలేననే అనుకున్నాను. సావిత్రిని పిలిచి ఒక వేలు పట్టుకోమంటే కుడివేలే పట్టుకుంది. మరి టైముకి వచ్చానా లేదా.

హైదరాబాద్ వెళ్తున్నానంటే చాలు వీధిలోవున్న

వాళ్ళందరూ తలోపనీ చెబుతారు. డైముండదగ్గరా అంటే వినరు. ఒకరికి చేసి మరొకరికి కాదంటే బావుండదు. మొహమాటం. ఇప్పుడంటే ప్రొహిబిషన్ తీసేశాక బాధ వదిలింది కాని-అంతకుముందు కృష్ణమూర్తిగారు ప్రాణాలు తీసేవాడు. నాకేమో అలాటి వెధవపనులు అలవాటులేవు.

పాపం! డబ్బు మాత్రంసరిపడా ముందేఇచ్చేసే వాడు. ఒకో సారి మాత్రం "పది రూపాయలే ఉంది పాణీ! మిగతా డబ్బు నువ్వే సర్ది పెద్దబుడ్డీయే పట్రా! రాగానే ఇస్తాలే" అని. అతని ముఖం చూస్తే జాలేసేది. అలాగే తెచ్చేవాణ్ణి.

త్రాగడం దురలవాటే అనుకోండి. అయినా కృష్ణమూర్తిగారు మంచి యాక్టరు. కిందటిజన్మలో గంధర్వుడట.

సురాపానం చెయ్యందే ఉండలేడట! పూనకం వచ్చి చెప్పుకున్నా డొకసారి. నిజం చెప్పొద్దూ! నే నమ్మాను. వాళ్ళావిడకి మాత్రం అప్పటికీ-ఇప్పటికీ నమ్మకం కుదరలా. మా వెంకటేశంగాడి లాగే ఆవిడకీ పూనకాల్లో నమ్మకం లేదు. వీళ్ళ ద్దర్నీ చూస్తే అనిపిస్తుంది - పూర్వం రాములవారు మొదలైన వాళ్ళకాలంలో ఉన్న రాక్షసుల గుణాలు ఇప్పుడుకూడా కొందరిలో ఉన్నాయని. లేకపోతే దేవుడ్నెందుకు నమ్మరు!

అ రె రే!

పా ప —

కారు కింద ...

తప్పుకోదే —

అమ్మయ్య అంగుళంవానిలో ప్రమాదంతప్పింది. ఇక్కడపడి చచ్చినా చూశ్శేం. అందులో చిన్నపిల్ల. ఎంత ఘోరం జరక్కుండా తప్పిం దివాళ.

అది చూడ్డం తప్పింది. అదృష్టం ఉండబట్టే!

సూర్యనారాయణగారు పాపం వాళ్లబ్బాయికే డబ్బిచ్చి రమ్మంటారు. వాడికివ్వడానికి హోస్టలుకు వెళ్తే పేకాటలో ఉన్నాడువాడు.

జీతాలొచ్చినా రాకపోయినా. తనూ, పిల్లలూ కడుపులు కట్టుకుని కొన ఊపిరినే కూడగట్టుకుని ట్యూషన్లు చెప్పి పైన పైన కూడబెట్టి యిస్తే కొడుకేదో ఉద్ధరిస్తాడని పాపం ఆయన ఆశ!

సూర్నాయణ మాస్టారంటే నా కెంతో ఇష్టం. బండ వెధవ నీకు చదువంటదు అని ఆయన తిడితే మాత్రం ఏం! ఫిఫ్తుఫారం వరకైనా లాగ గలిగింది ఆయన దయవల్లే.

అందుకే వాళ్లబ్బాయి డబ్బు తగలేస్తూంటే చెప్పలేక, చెప్పకుండా ఉండలేక ఒకసారి అనేశాను.

'మాస్టారూ! చాలా పనులున్నాయండి. ఈసారి హోస్టలుకు వెళ్ళటం కుదరదు' అని.

"అలా అంటే ఎలా పాణి యాభై రూపాయలే ఉన్నాయి సరిగ్గా. మళ్ళీ మనియార్డరుచెయ్యాలంటే రూపాయి కావాలి. అయినా వాడికి అవసరానికి అందుతుందో లేదో-"

ఏం చెప్పాలి మాస్టారికి-

వాడి అవసరం పేకాట!

మాస్టారి కళ్ళలో నీళ్ళు.

అవసరానికి అందుతూందో లేదో అని ఆయన బాధ

వాడేమో- ఆ గొట్టాం పాంటుగాడు ఆయన నెత్తురు తాగేస్తున్నాడు.



నెహ్రూ బహుమతి పొందిన సోవియట్ శిల్పకారుడు
యవెజ్నీ ఉచిటిక్ తయారుచేసిన ప్రతిమ

ఈ కుర్రాళ్ళంతా అంతే- ప్రతిదానికి గొడవ. సమ్మె- రాళ్ళు విసరటం- పిండాకూడా.

దేవుడు వీళ్ళని క్షమించడు.

కొంపదీసి బాబిగాడు కూడా ఇలాగే తయారవడు కదా!

పంకజం అనేది.

ఎక్కడ తిరిగినా ఏం చేసినా సావిత్రి ని-బాబిగాడ్ని జాగర్తగా చూసుకోమని పంకజానికి తనంటే ఎంత ప్రేమ. సావిత్రన్నా, బాబిగాడన్నా ఎంతప్రేమ. సావిత్రిని చేసుకోకముందు పంకజం ఎవరో తనెరగడు. తరువాత పరిచయమైంది. దగ్గరైంది. గుండెల్లో నిండిపోయింది. పంకజాన్ని కూడా పెళ్ళి చేసుకుంటే తన బతుక్కితోడు ఇద్దరు పెళ్ళాలా - మరి పెళ్ళి చేసుకునే ధైర్యం లేనప్పుడు ప్రేమ ఎందుకు - పెడాకులు.

అమ్మ అనేది. వగలొలకబోస్తే వీళ్ళమగవాళ్ళను వళ్లో వేసుకునికొంపలు కూలుస్తారనీ-

అమ్మ పాతకాలంది.

మనసులు మమతలు ఏం తెలుస్తాయి.

పంకజం లాగా ప్రాణం పెట్టేవాళ్ళ సంగతి తెలియదు.

నిజానికి పెళ్ళి చేసుకోవాల్సింది పంకజాన్ని కూడా -

కాని పంకజమే అంది.

"అసలే ఎత్తుపడిన కుటుంబం నా బరువుకూడా ఎందుకు. అదే కలిగినవాళ్ళయితే ఇద్దరు ముగ్గురు పెళ్ళాలున్నా పరవాలేద"ని అందుకు చక్రం వేసి చూసుకున్నాను. పంకజాన్ని పెళ్ళిచేసుకోవటం మంచిదా కాదా-అని- కాదని తేలింది.

నేను అదృష్టవంతుడ్ని-నాకా నమ్మకం ఉంది. కనుకనే నా పేరుకి తగ్గట్టు స్టీరింగుముందు కూచునే ఉద్యోగం వచ్చింది.

దీక్షితులుగారన్నారు.

"మీ వాడు చక్రం తిప్పుతాడు చూసుకో జానకమ్మా"అని అబద్ధంకాదు!

★